క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన సీఐ


సీఐ గురువారెడ్డి

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా గురువారెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన సతీశ్ ఈ నెల 6న సస్పెండ్ కావడంతో.. అప్పటి నుంచి డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఎస్‌బీలో పని చేస్తున్న 2004 బ్యాచ్‌కు చెందిన గురువారెడ్డిని పహాడీషరీఫ్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. నేరాల నియంత్రణ కోసం పెట్రోలింగ్ ముమ్మరం చేస్తామని తెలిపారు.

కందుకూరు సీఐగా మక్బూల్‌జానీ

కందుకూరు: కందుకూరు సీఐగా మక్బూల్ జానీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన విష్ణువర్ధన్‌రెడ్డి స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రాచకొండ కమిషనరేట్ నుంచి మక్బూల్ జానీ ఇక్కడికి బదిలీపై వచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని ఆయన కోరారు.

కార్పొరేటర్ దీపిక ఉదారత


మహిళకు చెక్కు అందజేస్తున్న దీపిక

బడంగ్‌పేట్: కార్పొరేటర్ బోయపల్లి దీపికరెడ్డి ఉదారత చాటుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళకు ఆర్థిక సాయం చేశారు. కార్పొరేషన్ పరిధిలోని 5వ డివిజన్ వినాయక హిల్స్ కాలనీలో నివాసం ఉంటున్న వెంకటమ్మ అనారోగ్యంతో బాధపడుతోంది. కాలనీ వాసుల ద్వారా విషయం తెలుసుకున్న కార్పొరేటర్ సోమవారం వెంకటమ్మ నివాసానికి వెళ్లి రూ.25 వేల చెక్‌ను అందజేశారు. ఆస్పత్రికి వెళ్లి మెరుగైన చికిత్స తీసుకోవాలని సూచించారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు శేఖర్‌రెడ్డి, కాలనీవాసులు, బాధిత కుటుంబ సభ్యులు ఉన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సదానందస్వామి తదితరులు

కందుకూరు: మండల పరిధిలోని అన్నోజిగూడలోని ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం గ్రామానికి చెందిన సదానందస్వామి ముదిరాజ్ ఉచితంగా పుస్తకాలు అందజేశారు. విద్యార్థులతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు సంబంధించిన స్టడీ మెటీరియల్ పంపిణీతో పాటు వివిధ రకాల వార్తా పత్రికలను ఏడాది పాటు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సదానందస్వామిని ప్రధానోపాధ్యాయుడు శ్రీశైలం, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ కో ఆర్డినేటర్ శివకుమార్, కిషన్ పాల్గొన్నారు.

రూ.8 లక్షల ప్రొసీడింగ్ పత్రాల అందజేత

మంచాల: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తామని మంచాల జెడ్పీటీసీ సభ్యురాలు మర్రి నిత్యనిరంజన్‌రెడ్డి అన్నారు. జిల్లాపరిషత్ నిధుల నుంచి మంచాల మండలంలోని లోయపల్లి, కాగజ్‌ఘాట్, కొర్రవాణి తండాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి రూ.8లక్షల ప్రొసీడింగ్‌లను స్థానిక నాయకులకు సోమవారం ఆమె పంపిణీ చేశారు. కాగజ్‌ఘాట్ గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ మరమ్మతులకు రూ. 2.65లక్షలు, లోయపల్లిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంకోసం రూ.2.25లక్షలు, కొర్ర వాణి తండాలో సీసీరోడ్డు నిర్మాణం కోసం రూ.3.10 లక్షలకు సంబంధించిన ప్రొసీడింగ్ అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు మర్రి నిరంజన్‌రెడ్డి, మండల కోఆప్షన్ మెంబర్ వాజీద్, స్థానిక నాయకులు మోహన్ నాయక్, చంటినాయక్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మంచాల: మంచాల మండల పరిధిలోని లింగంపల్లి, కొర్రవాణి తండాలో ఎస్‌ఐఆర్‌డీ (పంచాయతీ రాజ్) అధికారి డాక్టర్ మాధురి సోమవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో మహిళా సర్పంచ్‌లుగా ఉన్న వినోద, లక్ష్మిని కలిసి మాట్లాడారు. గ్రామాల్లో చెప్పట్టిన అభివృద్ధి కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ఆమెతోపాటు మరో అధికారి వాణి, ఎంపీఓ తేజ్‌సింగ్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మత్తులో చిత్తవుతున్న పల్లెలు

ఇన్నాళ్లు పట్టణాలకే పరిమితమైన మత్తు పదార్థాల వాడకం ఇప్పుడు పల్లెలు, తండాలకూ విస్తరిస్తోంది. చదువుకున్నోళ్లు, చదువురాని వాళ్లు అనే తేడాలేకుండా చాలా మంది జులాయిలు గంజాయి మోజులో పడుతున్నారు. యువత మత్తులో తూగుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటోంది. మత్తులో రోడ్డు ప్రమాదాలకు గురవుతోంది. ఎదుటి వ్యక్తుల ప్రాణాలు తీసేందుకు కూడా వెనుకాడడం లేదు. విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలు జరుగుతున్నా పోలీసులు పెద్దగా దృష్టి సారించలేదనే విమర్శలున్నాయి.

- గంజాయికి బానిసలవుతున్న యువత, విద్యార్థులు
- చెట్ల పొదలు, వెంచర్లు, శిథిల భవనాలే అడ్డా
- ఆరోగ్యం పాడవుతుందని వైద్యుల హెచ్చరిక
- పట్టించుకోని పోలీసు అధికారులు


తుక్కుగూడ ఔటర్ రింగ్ రోడ్డు వద్ద పోలీసులకు గంజాయితో పట్టుబడిన నిందితులు (ఫైల్)

మహేశ్వరం: మహేశ్వరం మండలం తుక్కుగూడ మున్సిపాలిటీలోని గ్రామాలు, తండాల్లో యువత, విద్యార్థులు గంజాయి, హుక్కా వంటి మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారు. కొంత మంది అక్రమార్కులు యువతకు గంజాయి అలవాటు చేసి, యథేచ్ఛగా విక్రయాలు జరుపుతున్నారు. యువతే కాకుండా పాఠశాల విద్యార్థులు సైతం మత్తుబారిన పడుతున్నారు. గ్రామ శివారులో శిథిల భవనాలు, చెట్ల పొదల్లో, వెంచర్లలో గంజాయి తాగేందుకు వేదికలుగా మార్చుకుంటున్నారు. పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు దృష్టి సారించి గంజాయి విక్రయించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

గ్రామాలు, తండాలకు విస్తరిస్తున్న గంజాయి..

మహేశ్వరం మండలంలోని మహేశ్వరం, మన్సాన్‌పల్లి, అమీర్‌పేట్, నాగారం, సిరిగిరిపురం, తుమ్మలూరు, మహేశ్వరం గేటు వద్ద ఉన్న పారిశ్రామిక వాడ, మన్సాన్‌పల్లి, తుక్కుగూడ మున్సిపాలిటీలోని రావిర్యాల, తుక్కుగూడ, మంఖాల్, సర్దార్ నగర్‌లో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. హైదరాబాద్, పాతబస్తీ నుంచి గంజాయి వ్యాపారులు గ్రామాలు, తండాల్లో ఉన్న యువతకు చేరవేస్తున్నారు. మండలానికి చెందిన పలువురు విద్యార్థులు, యువకులు నగరానికి వెళ్లి గంజాయి తెచ్చుకుంటున్నట్లు సమాచారం. ఇటీవల మహేశ్వరం మండలంలో కొందరు గంజాయి సరఫరా చేస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. మహేశ్వరం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి సరఫరాకు సంబంధించి నాలుగు కేసులు నమోదయ్యాయి. ఇటీవల మహేశ్వరం, సరూర్‌నగర్, హయత్‌నగర్ ఎక్సైజ్ శాఖ అధికారులు, పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి రామోజీ ఫిల్మ్‌సిటీ వద్ద ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర ప్రైవేట్ వాహనాల తనిఖీల్లో భారీగా గంజాయిని పట్టుకున్నారు.

కొరవడిన పోలీసుల నిఘా

మండలంలోని పలు గ్రామాల్లో చాపకింద నీరులా విస్తరిస్తున్న గంజాయి వ్యాపారానికి అడ్డూఅదుపు లేకుండా పోతోంది. పోలీసుల నిఘా తగ్గడంతో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. పోలీసులు, ఎక్సైజ్ పోలీసుల పర్యవేక్షణ కొరవడటంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. గంజాయి అనర్థాల గురించి యువకులు, విద్యార్థులకు అవగాహన కల్పించకపోవడంతో వారు మత్తుకు బానిసలవుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు గ్రామాల్లో నిఘాపెట్టి గంజాయి విక్రయాలను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



గ్రామాల్లో, పారిశ్రామికవాడల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం. అక్రమంగా గంజాయి విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తప్పవు. యువకులు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటివరకు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు కేసులు నమోదు చేశాం. సుమారు 4కిలోల752 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నాం. యువత గంజాయికి అలవాటుపడి తమ భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దు. గంజాయి విక్రయిస్తున్నా, సేవిస్తున్న వెంటనే సమాచారం అందించాలి.

– వీణారెడ్డి, ఎక్సైజ్ సీఐ, మహేశ్వరం

ఆరోగ్యం పాడు చేసుకోవద్దు



గంజాయి వలన ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఇది ఆరోగ్యానికి ఎంతో హాని చేస్తుంది. దీన్ని తీసుకున్నప్పుడు టీహెచ్‌సీ(టెట్రా హైడ్రో కనాబినల్) రక్తంలో కలిసి మెదడుకు చేరడంతో వెంటనే నిషా (మత్తు) ఎక్కి దాదాపు మూడు గంటల పాటు ఏం జరుగుతుందో, మనం ఏం చేస్తున్నామో తెలియని పరిస్థితి ఉంటుంది. ఎక్కువ తీసుకుంటే మతిస్థిమితం కూడా కోల్పోయే అవకాశం ఉంది. గంజాయి తీసుకున్న వ్యక్తి శారీరక, మానసికంగా బలహీనమవుతాడు.

– డాక్టర్ నవీన్, వైద్యాధికారి, ప్రభుత్వ ఆస్పత్రి, మహేశ్వరం

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఆనంద్‌నగర్, రాఘవేంద్ర కాలనీ, మదర్ డెయిరీ, లెక్చరర్స్‌కాలనీ, ఆలిండియా రేడియో, హయత్‌నగర్, కల్వంచ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. అలాగే 11కేవీ విద్యుత్‌నగర్ కొత్తపేట, మోహన్‌నగర్, లక్ష్మీనగర్, న్యూ మారుతీనగర్, ఆర్.కే.పురం, విజయపురికాలనీ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫారాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.. అసౌకార్యానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్/వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. టమోట లోకల్ రూ.19, వంకాయ రూ.13, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.45, కాకర రూ.38, బీర రూ.40, క్యాలీఫ్లవర్ రూ.15, క్యాబేజీ రూ.21, క్యారెట్ రూ.18. దొండ రూ.28, ఆలు రూ.23, ఉల్లి రూ.20, గోకర రూ.45, దోస రూ.21, సొర రూ.9, పొట్ల రూ.18, అరటి రూ.9, చిక్కుడు రూ.23, అర్వి రూ.55, మునగ రూ.75, చిలగడదుంప రూ.55, బీట్‌రూట్ రూ.17, కీర రూ.21, ఫ్రెంచ్ బీన్స్ రూ.35, కాప్సికమ్ రూ.55.

ఇళ్ల స్థలాలు కేటాయించండి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాంచందర్


ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కందుకూరు: మండల పరిధిలోని ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇళ్లు నిర్మించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కుమార్ ఆధ్వర్యంలో సోమవారం కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాంచందర్ మాట్లాడారు. గతంలో మండల పరిధిలోని పలు గ్రామాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించారని, ఇంతవరకు కబ్జా చూపలేదన్నారు. ఇళ్లు లేక పేదలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన వారికి ఎకరాకు 121 గజాల చొప్పున ప్లాట్లు కేటాయిస్తూ సర్టిఫికెట్లు అందించారని, కబ్జా మాత్రం చూపలేదన్నారు. పేదలకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరా రు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు శ్రీనివాస్, సాయిలు, యాదయ్య, జంగయ్య పాల్గొన్నారు.

ప్రజల గొంతుకగా ఉంటా

- బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి
- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి
- లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపు


సభలో మాట్లాడుతున్న సబితారెడ్డి

మీర్‌పేట: మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించిన నియోజకవర్గ ప్రజల గొంతుకగా ఉంటానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. సోమవారం మీర్‌పేటలోని ఎస్‌వైఆర్ గార్డెన్స్‌లో జరిగిన మహేశ్వరం నియోజకవర్గ కృతజ్ఞత, విజయోత్సవ సభకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి గెలిపించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఆకాంక్షలకు అనుగుణంగా మరింత బాధ్యతగా పనిచేస్తానని భరోసా ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పనిచేసి బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కాలనీలు, బస్తీలు, వార్డులు, గ్రామాల్లో పర్యటించి నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు సబితారెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మీర్‌పేట, బడంగ్‌పేట, జల్‌పల్లి, తుక్కుగూడ మున్సిపల్ కార్పొరేషన్లు, కందుకూరు, మహేశ్వరం మండలాలు, సరూర్‌నగర్, ఆర్‌కేపురం డివిజన్లకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

దేవేంద్ర విద్యాలయలో ‘పరీక్ష పే చర్చ’

తుక్కుగూడ: ప్రధానమంత్రితో నేరుగా మాట్లాడేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఓ చక్కని అవకాశాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కల్పించారు. కేంద్ర మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో ‘పరీక్ష పే చర్చ’ 7వ ఎడిషన్ సోమవారం తుక్కుగూడలోని దేవేంద్ర విద్యాలయలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పదవ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. పరీక్షలను సమర్థవంతంగా ఒత్తిడి లేకుండా ఎదుర్కొవడం, చిరునవ్వుతో పరీక్షలకు సమాధానాలు రాయడం ద్వారా విద్యార్థులకు పరీక్షలంటే భయాన్ని తొలగించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పరీక్షలకు ఎలా సన్నద్ధమవ్వాలి.. విద్యార్థులు ఎదుర్కొనే సవాళ్లు ఏమిటీ.. ఎలా అధిగమించాలి.. సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలనే తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల బోర్డు నంబర్ తూళ్ల వీరేందర్‌గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


చర్చలో పాల్గొన్న దేవేంద్ర విద్యాలయ విద్యార్థులు, ఉపాధ్యాయులు

నాణ్యమైన ఆహారం అందించాలి

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని జెడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎక్వాయిపల్లిలో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పర్యటించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోని మధ్యా హ్న భోజనం వంట గదిని పరిశీలించారు. నా ణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకుల కు సూచించారు. అంతకు ముందు గ్రామంలో ని వైకుంఠధామాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుగుణ సాయిలు, ఎంపీటీసీ ఉమావతి, నాయకులు వీరయ్య, బిక్షపతి, వెంకటేశ్, చంద్రయ్య తదితరులు ఉన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థి ప్రతిభ

మహేశ్వరం: మహేశ్వరం మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి విక్రమ్.. మార్షల్ ఆర్ట్స్ 2024 చాంపియన్‌షిప్‌ను కై వసం చేసుకున్నాడు. ఇటీవల హైదరాబాద్ ఇండోర్ స్టేడియం సరూర్‌నగర్‌లో వరల్డ్ నకయమ షోటోకన్ అసోసియేషన్ సంస్థ నిర్వహించిన రెండవ అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్ 2024 అండర్ 14, 42 కేజీల విభాగంలో మొదటి స్థానంలో నిలిచాడు. మొదటి రౌండ్‌లో నేపాల్‌కి చెందిన ప్రత్యర్థితో తలపడి గెలుపొందాడు. రెండవ రౌండ్‌లో దుబాయ్‌కి చెందిన ప్రత్యర్థిపై గెలిచి మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. మార్షల్ ఆర్ట్స్‌లో విజయం సాధించిన విక్రమ్‌ను మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బి.ధనుంజయ్, ఉపాధ్యాయులు అభినందించారు.


చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్న విద్యార్థి విక్రమ్

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

షాద్‌నగర్ ట్రాఫిక్ సీఐ రవీందర్‌నాయక్

ఆమనగల్లు: మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని షాద్‌నగర్ ట్రాఫిక్ సీఐ రవీందర్‌నాయక్ సూచించారు. పిల్లలు వాహనాలు నడిపి ప్రమాదాలు చేస్తే పిల్లలతో పాటు బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం పాఠశాల ఆవరణలో ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రవీందర్‌నాయక్ మాట్లాడుతూ.. మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలు చేస్తే వాహనాల యజమానులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆయన కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనంపై ఇద్దరికంటే ఎక్కువమంది ఎక్కరాదని సూచించారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధించిన కరపత్రాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అనసూయ, లెక్చరర్ కృష్ణయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాండు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాం

- చంద్రధన సర్పంచ్ కుమార్
- రూ.5.50 లక్షల సొంత నిధులతో పంచాయతీ ముఖద్వారం నిర్మాణం


పంచాయతీ ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

తలకొండపల్లి: గత ఐదేళ్లలో గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించినట్లు సర్పంచ్ బక్కి కుమార్ అన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.కోటితో పల్లె ప్రకృతి వనం, నర్సరీ, వాటర్ ఫిల్టర్, హైమాస్ట్ లైట్లు తదితర పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని చంద్రధనలో సర్పంచ్ బక్కి కుమార్ తన సొంత నిధులు రూ.5.50 లక్షలతో.. తాత బక్కి బాలయ్య, తండ్రి బక్కి చెన్నయ్య (వీఆర్‌ఏ)ల జ్ఞాపకార్థం నిర్మించిన గ్రామ పంచాయతీ ముఖ ద్వారాన్ని తన తల్లి బక్కి వెంకటమ్మతో కలిసి ప్రారంభించారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం మంజూర్ చేసిన రూ.కోటితో నిర్మించిన పల్లె ప్రకృతి వనం, నర్సరీ, వాటర్ ఫిల్టర్, హైమాస్ట్ లైట్లు తదితర అభివృద్ధి కార్యక్రమాలను వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, స్థానిక నాయకులతో కలిసి సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచ్ కుమార్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మంజూర్ చేసిన నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ప్రజలందరి సహాయ, సహకారాలతో ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు కింద దీన్‌దయాళ్ జాతీయ పురస్కార్ అవార్డు కూడా అందుకున్నట్లు సర్పంచ్ చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుధాకర్, కార్యదర్శి ప్రవీణ్ కుమార్, వార్డు సభ్యులు కృష్ణవేణి, రాజు, సనీత, వెంకటేష్, చైతన్య, రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ రాములు, డాక్టర్ ప్రసాద్, నర్సింహగౌడ్, రవీందర్‌రెడ్డి, సుభాష్, జంగయ్య, కుమార్, శివశంకర్, మనోహర్, అయ్యప్ప, శేఖర్, ఉదయ్, రమేశ్, ప్రశాంత్, రవి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇవేం దారులు!


ప్రధాన రోడ్లపై పోసిన డిస్మెంటల్ మట్టి

విశ్వేశ్వరయ్య ఇంజనీర్స్ కాలనీలో రహదారులు కరువు

రోడ్లు.. డ్రైనేజీ.. మంచినీరు.. వీధి దీపాలు.. ఇలా కనీస సదుపాయాలు లేక అనేక కాలనీలు కొట్టుమిట్టాడుతున్నాయి. అయితే, సమస్యలపై అటు అధికారులు.. ఇటు ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఆవేదన చెందుతున్నారు.


రోడ్లపైనే రాళ్లు వేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్ కాలనీలో అంతర్గత రోడ్లు వేయకపోవడంతో ద్విచక్రవాహనాలే కాదు.. పాదచారులు సైతం నడవలేని స్థితి నెలకొందని కాలనీవాసులు చెబుతున్నారు. కాలనీలోని అంతర్గత రోడ్లతో పాటు ప్రధాన రహదారులు సైతం గుంతలమయంగా మారింది. ఎల్‌బీనగర్ జీహెచ్‌ఎంసీ సర్కిల్ ఉన్నతాధికారుల పర్యవేక్షణా లోపంతో పాటు కిందిస్థాయి సిబ్బంది సమస్యపై నిర్లక్ష్యంగా ఉన్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాలనీలో కనీస వసతులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం..



కాలనీలో రోడ్లు సరిగా లేక ఇబ్బంది పడుతున్నాం. ఇక వర్షం వచ్చిందంటే నరకమే. కాలనీలోని అంతర్గత రోడ్లన్నీ డిస్మెంటల్ మట్టితో నింపేశారు. దీంతో బండ్లు వెళ్లలేని స్థితి. నడవడానికి కూడా చాలా ఇబ్బంది పడుతున్నాం. అధికారులు వెంటనే స్పందించాల్సిన అవసరం ఉంది.

– విజయభాస్కర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు

వసతులు సమకూర్చాలి..



కాలనీలో ప్రజలకు అవసరమైన వసతులు సమకూర్చాలి. కాలనీలో చాలా చోట్ల రోడ్లు సరిగా లేక ఇబ్బంది పడుతున్నాం. హస్తినాపురం డివిజన్ పరిధిలోనే అతిపెద్ద కాలనీ మాది. కానీ, కనీస వసతులు మాత్రం లేవు. జీహెచ్‌ఎంసీ అధికారులు ముక్కు మండి మరీ టాక్సులు వసూలు చేస్తారు.. వసతులు మాత్రం కల్పించారు.

– అమర్‌నాథ్ యాదవ్, కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి

చర్యలు తీసుకోవాలి..



పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కాలనీలో వసతులు ఏర్పాటు చేయాలి. అధికారులు స్పెషల్ డ్రైవ్‌లు ఏర్పాటు చేసి పన్నులు వసూలు చేస్తున్నారు. కానీ, సమస్యలు పట్టించుకోవడం లేదు. మా సమస్యలపై నాయకులు సైతం పట్టించుకోవాలి.

– రాహుల్‌సాగర్, కాలనీ సంక్షేమ సంఘం కోశాధికారి